టేకు దుంగల పట్టివేత

కారును స్వాధీనం చేసుకున్న అటవీ శాఖ అధికారులు

బెల్లంపల్లి రూరల్, ఫిబ్రవరి 14 : అక్రమంగా తరలిస్తున్న ఏడు టేకు దుంగలను బుధవారం అటవీ అధికారులు పట్టుకున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ నుంచి బెల్లంపల్లికి ఏపీ 39 యూబీ 4078 నంబర్ గల కారులో టేకు దుంగలు తరలిస్తున్నారని అటవీ శాఖ అధికారులకు పక్కా సమాచారం అందింది. దీంతో వారు కారును పట్టుకుని టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.35 వేల వరకు ఉంటుంది. ఎఫ్ఆర్వో సుభాష్, డిప్యూటీ ఎఫ్ఆర్వో గౌరీశంకర్, ఎఫ్ఎస్వో శ్రీనివాస్ దాడుల్లో పాల్గొన్నారు. పట్టుబడ్డ కారు, టేకు దుంగలను అటవీ శాఖ రేంజ్ కార్యాలయానికి తరలించారు.

20 మందికి ఆపరేషన్లు

ఆపరేషన్లు చేయించుకున్న వారితో వైద్య సిబ్బంది

మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 14 : మంచిర్యాల జనరల్ ఆస్పత్రిలో బుధవారం 20 మందికి వేసక్టమి ఆపరేషన్లు చేశారు. ఆపరేషన్లు చేయించుకున్న ఒక్కొక్కరికి రూ. 1100 పారితోషికం అందించామని డీఎంహెచ్వో సుబ్బరాయుడు తెలిపారు. ఆపరేషన్లు చేసిన వారిలో యాకూబ్ పాషా, అరుణశ్రీ, నవీన్, ఏఎస్వో దామోదర్, ఎల్డీ రాజేశ్వర్, జిల్లా మీడియా అధికారి వెంకటేశ్వర్లు ఉన్నారు.

చెట్లు నరికిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆసిఫాబాద్ రేంజ్ అటవీశాఖ అధికారి అప్పల కొండ

సిబ్బంది కొరత వల్లే..

- చెట్ల నరికివేతను అడ్డుకోలేక పోతున్నాం..
- ఆసిఫాబాద్ అటవీ రేంజ్ అధికారి అప్పల కొండ

వాంకిడి, ఫిబ్రవరి 14 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని 29 వేల హెక్టార్లలో గోయగాం అటవీ ప్రాంతం విస్తరించి ఉందని, ఈ రేంజ్లో ఉండాల్సిన సిబ్బంది పూర్తిస్థాయిలో లేరని, దీని కారణంగానే అడవుల నరికివేతను అడ్డుకోలేక పోతున్నామని ఆసిఫాబాద్ అటవీ రేంజ్ అధికారి అప్పల కొండ తెలిపారు. 'అటవీ శాఖలో అవినీతి కొండ' అనే శీర్షికన బుధవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. తన సిబ్బందితో కలిసి చెట్లు నరికిన ప్రాంతాన్ని సందర్శించారు. టేకు చెట్లను తనిఖీ చేసి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్లు నరికి వేయడిన మాట వాస్తవమేనని అన్నారు. స్మగ్లర్లు అటవీ సిబ్బంది ఎక్కడ ఉన్నారని నిఘా పెట్టి అడవులను నరుకుతున్నారన్నారు. గత నవంబర్లో వంద చెట్ల వరకు నరికారని, తాజాగా కొన్ని చెట్లను నరికి ఉంటారని అన్నారు. టేకు చెట్లను నరికి కలప రవాణా చేస్తున్న షేక్ ఖాజా, షేక్ సమీర్, షేక్ హబీబ్, షేక్ జమీర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుడ్లు గుట్కాయ స్వాహా

కాంట్రాక్టర్ల ధన దాహంతో అంగన్వాడీలకు చేరని కోడిగుడ్లు

- ప్రతి నెలా 30 అందించాల్సి ఉండగా.. ఇందులో సగం పక్కదారి
- రెండు విడుతలకు.. ఒకే విడుత సరఫరా
- ప్రతి నెలా లక్షలాది రూపాయలు మింగేస్తున్న వైనం
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 14 : ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం అధికారులు, కాంట్రాక్టర్ల ధన దాహంతో పక్కదారి పడుతున్నది. అంగన్వాడీల్లోని లబ్ధిదారుల సంఖ్యను బట్టి ప్రతి నెలా ఒక్కొక్కరికీ 30 కోడి గుడ్లు ఇవ్వాల్సి ఉండగా, ఇందులో సగం స్వాహా చేస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో నెలకు 15 గుడ్లనే సరఫరా చేసేవారు. రక్తహీనత నుంచి బయటపడడం కోసం వాటి సంఖ్యను 30కి పెంచారు. ప్రతినెలా ఒకటి నుంచి ఐదో తేదీలోగా 15 పికాక్ బ్లూ కలర్ గుడ్లు, 16,17 తేదీల్లోగా మిగితా 15 రెడ్ కలర్ గుడ్లను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి నెలా రెండు విడుతలుగా వాటిని సరఫరా చేయాల్సి ఉండగా, గత మూడు నెలలుగా కొన్ని ప్రాంతాల్లో ఒకే విడుత సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఇదేమని అడిగితే మిగిలినవి ఇంకా రాలేదని చెబుతుండడం గమనార్హం. ప్రస్తుతం మార్కెట్లో కోడిగుడ్ల ధరలు పెరగడంతో అధికారుల అండదండలతోనే వాటిని పక్కదారి పట్టిస్తూ అందినకాడికి దండుకుంటున్నాడనే ఆరోపణలున్నాయి.

నెలకు లక్షల్లో స్వాహా...

జిల్లాలో గర్భిణులు, బాలింతలు, పిల్లలందరినీ కలుపుకొని మొత్తం 47,961 మంది ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికీ ప్రతినెలా 30 గుడ్ల చొప్పున సుమారు 11,65,690 (గర్భవతులు, బాలింతలు, మూడు సంవత్సరాల పైన వారికి – 8,53,530, మూడు సంవత్సరాలలోపు వారికి – 3,12,160 (19,510 మంది మూడేళ్లలోపు పిల్లలుండగా, వీరిలో ఒక్కొక్కరికీ ప్రతి నెలా 16 గుడ్లు మాత్రమే ఇస్తారు) గుడ్లు సరఫరా చేయాల్సి ఉంది. కాంట్రాక్టర్ మాత్రం ఒకే విడుత మాత్రమే అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నాడు. ఈ లెక్కన నెలకు సగటున 5 లక్షలకు పైగా గుడ్లను సరఫరా చేయకుండా కాజేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో గుడ్డు ధర రవాణా చార్జీలు కలుపుకొని రూ. 5 చొప్పున లెక్కించినా.. ప్రతి నెలా లక్షలాది రూపాయల విలువైన గుడ్లను మింగేస్తున్నట్లు సమాచారం.

అక్రమాలకు నిలయంగా సంక్షేమ శాఖ

సంక్షేమశాఖ అక్రమాలకు నిలయంగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంగన్వాడీ కేంద్రాల్లో గుడ్లు, బాలామృతంతో పాటు తదితర సరుకులు అందించాలి. కానీ ఇవేవీ సక్రమంగా అందడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా కోడి గుడ్ల వ్యవహారంలో ప్రతినెలా లక్షల్లో చేతులు మారుతున్నట్లు సమాచారం. కాంట్రాక్టరు గుడ్లు సరఫరా చేయకున్నా అడిగే నాథుడే లేకుండాపోయాడు. అధికారులకు సైతం వాటాలు ముడుతుండటంతో చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా, ఈ విషయమై జిల్లా సంక్షేమాధికారి కొట్టె చిన్నయ్యను వివరణ కోరేందుకు పలుమార్లు సెల్ఫోన్లో సంప్రదించగా లిఫ్ట్ చేయలేదు.

అంగన్ వాడీ కేంద్రాలు, వివరాలు ..

- జిల్లాలోని అంగన్ వాడీ కేంద్రాలు - 969
- ప్రాజెక్టులు 4 - మంచిర్యాల, చెన్నూర్, లక్షెట్టిపేట, బెల్లంపల్లి
- బాలింతలు - 4,835, గర్భిణులు - 4,181
- 1 - 3 ఏళ్ల లోపు పిల్లలు - 19,510 (ఒక్కొక్కరికీ నెలకు 16 గుడ్లు మాత్రమే)
- 3 - 6 ఏళ్ల లోపు పిల్లలు - 19,435

అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులు

ప్రతి రోజూ ఇవ్వడం లేదు

కోడిగుడ్లు నెలకు రెండుసార్లు రావాల్సి ఉంది. ఈ నెల ఇప్పటి వరకు ఒక్కసారి కూడా రాలేదు. ఐదో తారీఖులోపల రావాలే. మా మేడం వచ్చినప్పుడు పిలిచి మరీ ఇస్తుంది. ప్రతిరోజూ కోడిగుడ్డు ఇవ్వడం లేదు. సార్లు ఈ విషయాన్ని పట్టించుకోవాలి.

- అహ్మద్ బేగం, బాలింత, మజీద్ వాడ, మంచిర్యాల

మూడు నెలల సంది రావట్లేదు

మూడు నెలల సంది గుడ్లు సరిగ్గా రావడం లేదు. నెలలో ఏదో ఒక రోజు వస్తాయి. అందులో మాకు 10 కూడా సరిగా అందడం లేదు. మాకే కాదు చిన్న పిల్లలు, గర్భిణులకు కూడా వస్తలేవు. పెద్ద మేడమ్కు కూడా చెప్పినం. పై నుంచి రాకుంటే మేము ఏం చేస్తాం అంటున్నది. గిట్లతే మాకు పౌష్టికాహారం ఎట్లా ఇచ్చినట్లైతది. - షాహీన్, బాలింత, మంచిర్యాల

డంపర్ను ఢీకొట్టిన వోల్వా వాహనం

- కాంట్రాక్టు కార్మికుడికి తీవ్ర గాయాలు
- తెగిపడ్డ కుడికాలు
- శ్రీరాంపూర్ ఓసీపీలో ప్రమాదం
- కార్మికుల ఆందోళన

గాయపడ్డ కాంట్రాక్టు కార్మికుడు శ్రీకాంత్

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 14 : శ్రీరాంపూర్ ఓసీపీలో జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు మొగిళి శ్రీకాంత్కు తీవ్ర గాయాలై కుడికాలు కోల్పోయాడు. కార్మికుల కథనం ప్రకారం.. ఓసీపీలో మట్టి తవ్వకాలు, తరలింపు జరుగుతుండగా.. బుధవారం తెల్లవారుజామున ఐదు గంటలకు వోల్వా డ్రైవర్ తను నడుపుతున్న వాహనాన్ని ముందున్న డంపర్కు ఢీకొట్టాడు. దీంతో మొగిళి శ్రీకాంత్ కుడికాలు పూర్తిగా విరిగి వేరుగా పడింది. దీంతో తోటి కార్మికులు శ్రీకాంత్ను మంచిర్యాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శ్రీకాంత్ రామగుండం మండలం మూర్మూర్ గ్రామానికి చెందిన వాడు. కాగా రోజూ అక్కడి నుంచే వచ్చి విధులు నిర్వర్తిస్తున్నాడు.

కార్మికుల ఆందోళన

శ్రీకాంత్కు నష్టపరిహారం చెల్లించాలని తాళ్లపల్లి, సింగాపూర్ కౌన్సిలర్ బండారి సంధ్యారాణి సుధాకర్ జీవీఆర్ సంస్థ మేనేజర్ పెంచలయ్యను డిమాండ్ చేశారు. డంపర్ ఆపరేటర్లు, కార్మికులు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే ప్రేమ్సాగర్రావు జోక్యం చేసుకొని ప్రమాదానికి గురైన శ్రీకాంత్కు పూర్తి వైద్యం అందించాలని, కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని సూచించిన మేరకు జీవీఆర్ యాజమాన్యం అంగీకరించడంతో కార్మికులు ఆందోళన విరమించారు. కాగా.. కాంట్రాక్టు సంస్థ మట్టి తవ్వకాలు, తరలింపు పనుల్లో వాహనాల నిర్వహణలో కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదని కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూ) రీజియన్ కార్యదర్శి అప్రోజ్ఖాన్ ఆరోపించారు. ప్రమాద స్థలాన్ని సందర్శించారు.

డీఎల్పీవోలకు మోమొంటును అందజేస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్

ఉద్యోగులకు బదిలీలు సహజం

మంచిర్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్

హాజీపూర్, ఫిబ్రవరి 14 : ఉద్యోగులకు బదిలీలు సహజమేనని మంచిర్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. డీఎల్పీవోలుగా విధులు నిర్వహించిన బదిలీపై వెళ్తున్న ప్రభాకర్రావు, ఫణీందర్ రావులను జిల్లా పంచాయతీ అధికారుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మూడేండ్లుగా ప్రభుత్వ పథకాలను బాగా అమలు చేశారని గుర్తు చేశారు. కాగా.. బదిలీపై జిల్లాకు వచ్చిన డీఎల్పీవోలు శ్రీమతి ధర్మారాణి, భిక్షపతిలు రాహుల్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, జిల్లా పంచాయతీ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, ప్రధాన కార్యదర్శి అజ్మత్ అలీ, కోశాధికారి అలీ, అసోసియేట్ అధ్యక్షుడు అనిల్, ఉపాధ్యక్షుడు వాసు, రమేశ్, శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడు చంద్రమౌళి, కార్యదర్శి నరేందర్, సుమన్, పద్మనాభం, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రవణ్, పాల్గొన్నారు.

జడ్పీ సీఈవోకు సన్మానం

జడ్పీ సీఈవోగా వస్తున్న గణపతిని కార్యాలయ సూపరింటెండెంట్లు, సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్లు బాలకృష్ణ, సత్యనారాయణ, శ్రీనివాస్తోపాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ ఎఫ్ఎస్వోలకు అవగాహన కల్పిస్తున్న రేంజ్ ఆఫీసర్ హఫీసొద్దీన్

కవ్వాల్లో శిక్షణ ఎఫ్ఎస్వోల పర్యటన

జన్నారం, ఫిబ్రవరి 14 : తెలంగాణ ఫారెస్టు అకాడమీ హైదరాబాద్లో శిక్షణ పొందుతున్న 17 మంది ఎఫ్ఎస్వోలు బుధవారం జన్నారం రేంజ్ గోండుగూడ బీట్ అటవీ ప్రాంతంలో పర్యటించారు. అడవులు, వన్యప్రాణుల రక్షణ, గడ్డి క్షేత్రాల పెంపకం, తాగునీటి వసతి, వేటగాళ్లను నిరోధించడం వంటి వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో తిరుపతి పాల్గొన్నారు.

వసంతోత్సవం

బాసరలో వైభవంగా వసంత పంచమి వేడుకలు

- రికార్డుస్థాయిలో అక్షర శ్రీకారాలు
- ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ
- భక్తులకు సరైన ఏర్పాట్లు చేయని అధికార యంత్రాంగం
- అక్షరాభ్యాసానికి దాదాపు ఎనిమిది గంటల సమయం
- క్యూలైన్లలో బారులుదీరిన భక్తజనం
- అమ్మవారిని దర్శించుకున్న 70 వేలకు పైగా భక్తులు

అక్షరాభ్యాస మండపంలో కూర్చున్న భక్తులు

బాసర, ఫిబ్రవరి 14 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో వసంత పంచమి వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం వసంత పంచమిని పురస్కరించుకుని భారీగా భక్తులు తరలివచ్చారు. వేకువజామున మూడు గంటల నుంచే అమ్మవారి దర్శనంతోపాటు చిన్నారుల అక్షరాభ్యాసానికి బారులుదీరారు. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణ

రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ ఆర్జేసీ జ్యోతి, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్లు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు అమ్మవారి ప్రతిమలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండ ముథోల్ సీఐ మల్లేశ్, బాసర ఎస్సై గణేశ్, మరో ఆరుగురు ఎస్సైలు, దాదాపు 400 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతోపాటు బాసర గ్రామస్తులు, సేవా సమితి సభ్యులు చిన్నపిల్లలు, భక్తులకు తాగునీరు, పాలు, బిస్కెట్స్ను అందజేశారు.

భారీగా అక్షరాభ్యాసాలు

వసంత పంచమి సందర్భంగా రికార్డు స్థాయిలో అక్షర శ్రీకారాలు జరిగాయి. రూ.1000 అక్షరాభ్యాసాలు 3735, రూ.150 అక్షరాభ్యాసాలు 3911 మొత్తం 7646 జరిగాయి. ఆర్జిత సేవలు, ప్రసాద విక్రయాల ద్వారా అమ్మవారికి రూ. 62 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు.

సరైన ఏర్పాట్లు చేయని అధికారులు

అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు క్యూలైన్స్ మినహా ఏర్పాట్లు చేయలేదు. ఉదయం 3 గంటల నుంచి అక్షరాభ్యాసాలు ప్రారంభం కాగా.. దాదాపు రెండు గంటలు మాత్రమే క్యూలైన్లలో భక్తులకు పాలు, బిస్కెట్స్ అందజేశారు. భక్తుల రద్దీ పెరుగుతుండడంతో అధికారులు చేతులెత్తేశారు. దీంతో భక్తులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు ఆకలితో అలమటించి క్యూలైన్లలోనే ఏడ్చారు. కొందరు భక్తులు క్యూలైన్ నుంచి బయటకు రాలేక అక్కడే కూర్చుండి పోయారు. దాదాపు దర్శనానికి 6 నుంచి 8 గంటల సమయం పట్టింది. దేవస్థాన సిబ్బంది భక్తులకు సేవలు ఏర్పాటు చేయలేదు. ఈవో కార్యాలయంలో కూడా కనిపించలేదు. కొందరు అక్షరాభ్యాసం, దర్శనం చేసుకోకుండానే వెనుదిరిగారు. భక్తుల రద్దీని ముందే ఊహించినప్పటికీ ఏర్పాట్లు చేయకపోవడంతో బాసర గ్రామస్తులు ఎంపీ బాపురావు ముందు తమ గోడును వెల్లబోసుకున్నారు.

హాజరు కాని దేవాదాయశాఖ మంత్రి

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక గత ప్రభుత్వం యేటా వసంత పంచమికి దేవాదాయ శాఖ తరపున అప్పటి మంత్రి ఇంద్రకరణ్రెడ్డి హాజరై పట్టు వస్త్రాలను సమర్పించేవారు. కానీ.. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న కొండా సురేఖ పట్టు వస్త్రాలను సమర్పించడానికి రాకపోవడంతో భక్తులు, జిల్లా వాసులు నిరాశకు గురయ్యారు.


పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్, ఎమ్మెల్సీ విఠల్, ఎంపీ బాపురావ్

హత్య కేసులో నలుగురు అరెస్టు

- అక్రమ సంబంధమే కారణం
- వివరాలు వెల్లడించిన డీసీపీ

వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ రాంనాథ్కేకన్, వెనకాల నిందితులు

మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 14 : మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని కమ్మర్పల్లి శివారు అటవీ ప్రాంతంలో మంగళవారం రాత్రి జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. మంచిర్యాల డీసీపీ రాంనాథ్ కేకన్ బుధవారం హత్య కేసు వివరాలను వెల్లడించారు. చెన్నూరు మండలం పొన్నారం గ్రామానికి చెందిన బట్టే పద్మ, బట్టే శేఖర్ దంపతులకు ఇద్దరు పిల్లలు. పద్మకు ఇదే గ్రామానికి చెందిన రామగిరి మహేందర్తో నాలుగేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. నాలుగు నెలల క్రితం మహేందర్, పద్మలు పారిపోయారు. చెన్నూరు పోలీసు స్టేషన్లో భర్త ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. తన ఇష్ట ప్రకారమే వెళ్లిపోయానని పద్మ పోలీసులకు తెలిపింది. నాలుగు నెలలుగా కలిసి ఉంటున్న పద్మ, మహేందర్ల మధ్య నెల రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. వేధింపులు అధికం కావడంతో పద్మ కమ్మర్పల్లిలోని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న మహేందర్ అక్కడికి కూడా వెళ్లి వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈ విషయంలో పద్మ తల్లిదండ్రులు మొగిలి ఓదెలు, సుగుణక్కలు కలిసి భర్త శేఖర్తో మాట్లాడి మహేందర్ను అడ్డు తొలిగించుకోవాలని నిర్ణయించుకున్నారు. అనుకున్న పథకం ప్రకారం పద్మ మంగళవారం రాత్రి తనవద్దకు రావాలని ఫోన్ చేసింది. ఆమె పిలుపు మేరకు కమ్మర్పల్లికి వెళ్లిన మహేందర్ను పద్మతోపాటు భర్త శేఖర్, ఆమె తల్లిదండ్రులు ఓదెలు, సుగుణక్కలు కర్రలతో తలపై కొట్టి చంపారు. అనంతరం ఎడ్లబండిపై శవాన్ని ఊరు సమీపంలోని అటవీ ప్రాంతానికి తరలించి తగులబెట్టే ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న యువకులు విషయాన్ని పసిగట్టి మహేందర్ అన్న రవీందర్కు సమాచారం ఇవ్వడంతో ఆయన పోలీసులకు తెలిపాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు జైపూర్ ఏసీపీ మోహన్ ఆధ్వర్యంలో ఎస్సై మహేందర్, సిబ్బందితో విచారణ చేపట్టారు. బుధవారం నిందితులను అరెస్టు చేశారు. నిందితులపై హత్యకేసుతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసినట్లు డీసీపీ పేర్కొన్నారు. 12 గంటల్లోనే నిందితులను పట్టుకున్న పోలీసు అధికారులను, సిబ్బందిని డీసీపీ అభినందించారు.

పలువురు ఏసీపీల బదిలీ

మంచిర్యాల టౌన్ , ఫిబ్రవరి 14 : రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న పలువురు ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. రెండో దఫా 95 మంది ఏసీపీలు బదిలీ కాగా.. ఇందులో రామగుండం కమిషనరేట్లో జైపూర్ ఏసీపీగా పనిచేస్తున్న మోహన్ను హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్లోని సీసీఎస్లో పనిచేస్తున్న ఆరె వెంకటేశ్వర్లును జైపూర్ ఏసీపీగా నియమించారు. మంచిర్యాల ఏసీపీగా పనిచేస్తున్న తిరుపతిరెడ్డిని ఖమ్మం రూరల్ ఏసీపీగా బదిలీ చేశారు. ఆయన స్థానం లో కామారెడ్డిలో డీఎస్పీగా ఉన్న రత్నపురం ప్రకాశ్ను నియమించారు. అదేవిధంగా బెల్లంపల్లి ఏసీపీగా పనిచేసిన సదయ్య ఆసిఫాబాద్ ఏసీపీగా బదిలీ అయ్యారు. ఖాళీగా ఉన్న పెద్దపల్లి ఏసీపీ స్థానంలో వరంగల్ సీసీఆర్బీలో ఉన్న కృష్ణను నియమించారు. సీసీఆర్బీ ఏసీపీగా రామగుండం కమిషనరేట్లో ఇటీవల నియమితులైన మాధవిని కరీంనగర్ సీసీఎస్ ఏసీపీగా బదిలీ చేశారు.

సమ్మెకు దూరంగా ఉండండి..

- 16వ తేదీన విధులకు హాజరవ్వండి..
- బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో సహకరించండి..
- సింగరేణి సీఎండీ బలరాం విజ్ఞప్తి

గోదావరిఖని, ఫిబ్రవరి 14 : కొన్ని కార్మిక సంఘాలు వివిధ డిమాండ్లతో 16వ తేదీన దేశవ్యాప్తంగా ఒకరోజు సార్వత్రిక సమ్మె కు పిలుపును ఇచ్చాయని, ఆ సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొ న కూడదని సింగరేణి సీఎండీ బలరాం ప్రకటనలో కార్మికులను కోరారు. ఆ డిమాండ్లు మనకు సంబంధించినవి కావని, అటువంటప్పుడు సమ్మెలో పాల్గొనాల్సిన వసరం ఉందా ఒకసారి ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. బొగ్గు ఉత్పత్తికి సహకరించాలని పేర్కొన్నారు. ఒక రోజు సమ్మె చేస్తే సంస్థ రూ.85 కోట్లు నష్టపోతున్నదని, కార్మికులు రూ.18 కోట్ల వేతనాలను కోల్పోతారని అన్నారు.